క్లుప్తంగా

పీహెచ్‌సీకి వసతులు కల్పించాలని వినతి



మంత్రి దామోదరను కలిసిన కొన్యాల మాజీ సర్పంచ్ దంపతులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని కొన్యాల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి (పీహెచ్‌సీ) మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆదివారం వినతి పత్రం ఇచ్చినట్లు కొన్యాల మాజీ సర్పంచ్ దండు సుజాత తెలిపారు. ఉపకేంద్రానికి రెగ్యులర్ ఏఎన్‌ఎంను కూడా నియమించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

భూంగొండేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలి



భూంగొండేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రతీ ఒక్కరూ భూంగొండేశ్వరుడి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పిలుపు ఇచ్చారు. నారాయణఖేడ్‌లో భూంగొండేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూంగొండేశ్వరుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మేకలు, గొర్రెల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి, మాజీ సర్పంచ్ కిష్టయ్యమాస్టారు, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ప్రారంభం



నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్లు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఈనెల 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు ప్రజాపాలన సభలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల వారీగా నిర్వహించిన సభల్లో ప్రజలు అందజేసిన దరఖాస్తుల డేటా ఎంట్రీని ఆదివారం ప్రారంభించారు. ఈనెల 17వ తేదీ నాటికి డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని పస్తాపూర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంతంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఇందులో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు.

వ్యక్తి అదృశ్యం



తులసీరామ్

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన భర్త కనిపించకుండా పోయిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తుర్కుంచల్ మండల్ లింగంపల్లి గ్రామానికి చెందిన తులసీరాం, సేనావత్ మనీబాయ్ దంపతులు బతుకుదెరువు కోసం ఏడాది క్రితం అమీన్‌పూర్ మండలం పరిధి లింగమయ్య కాలనీకి వచ్చారు. తులసీరామ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో తులసీరామ్ ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. భార్య ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ మేసేజ్ రావడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిషేధిత మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిషేధిత మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రాపురం పోలీసులు హెచ్చరించారు. ఆదివారం రామచంద్రాపురం పరిధిలోని బొంబాయి కాలనీకి చెందిన సాయి రాకేష్ ప్రభుత్వం నిషేధించిన మాంజాలు విక్రయిస్తున్నాడని పోలీసులు తెలుసుకున్నారు. కాలనీకి చేరుకొని వాటిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా మల్లన్న జాతర

- స్వామివారి జాతరలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- ప్రత్యేక పూజల నిర్వహణ
- ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడి



పటాన్‌చెరు బండల మల్లన్న జాతరలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధి ఆల్విన్ కాలనీలో ప్రారంభమైన బండల మల్లన్న జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భవిష్యత్‌లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప, గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, గోపాల్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలం జంగంపేట గ్రామంలోగల రేణుకా ఎల్లమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వర స్వామి కల్యాణం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో శ్రీ సోమేశ్వర స్వామి కల్యాణం, జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్ నాయకులు పరమేష్ యాదవ్,కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపూర్‌లో మల్లన్న స్వామి కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప నాగేష్ తదితరులు



రుద్రారంలో నీలం మధు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న జాతర నిర్వాహకులు

తెల్లాపూర్‌లో..

తెల్లాపూర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, జాతర వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీశైలం, తెల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధి పెద్దాపూర్ గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరను ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ పూజారులు ఒగ్గు మల్లయ్య, ఒగ్గు కొమురయ్య స్వాముల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో 112వ డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనాగేష్, గొర్రెల కాపరుల సంఘం మాజీ డైరెక్టర్ నాగేష్ కురుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ గౌడ్, జిల్లా కురుమ యువత అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు: మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించిన మల్లన్న స్వామి జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నిర్వహించే జాతర, ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో పాటు, గ్రామస్తులు ఐకమత్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు.

మంత్రిని కలిసిన చెరకు రైతులు



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం హైదరాబాద్‌లో చెరకు రైతులు, కార్మికులు కలిశారు. తమ సమస్యలు వివరించారు. ట్రైడెంట్ షుగర్ కర్మాగారం యాజమాన్యం రూ.9 కోట్ల వరకు బకాయి చెల్లించాల్సి ఉందని, బకాయి చెల్లించకుండా యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆరోపించారు. పంట పెట్టుబడి లేక నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభంకానందున తమ బతుకులు రోడ్డున పడ్డాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి ఇప్పించి వెంటనే కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పత్తి రైతుకు మద్దతు ధర చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పత్తి రైతులకు తేమ శాతం పేరుతో కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వ మద్దతు ధర చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో రైతులతో కలిసి మాట్లాడారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. రైతులను తేమ శాతం పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ ప్రైవేట్ వ్యాపారస్తుల కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు రూ.6,300 లకు గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసి వాటిని నేరుగా సీసీఐకి మద్దతు ధర రూ.7,020 చొప్పున విక్రయిస్తున్నారని ఆరోపించారు. రైతులు క్వింటాల్ రూ.500 నుంచి 700 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్, పోచయ్య, మహేష్, పుష్పమ్మ, రాములు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సమాచారం బ్రెయిలి లిపిలో ఉంచాలి

ఎన్పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న మల్లేశం

జోగిపేట(అందోల్): ప్రభుత్వ సమాచారాన్ని బ్రెయిలీ లిపిలో అందుబాటులో ఉంచాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల అభివృద్ధికి కృషి చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా ప్రచార కార్యదర్శి మన్నె పోచయ్య అన్నారు. ఆదివారం లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి సందర్భంగా జోగిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రపంచంలోని అంధుల విద్యాభివృద్ధికి ప్రత్యేక లిపిని కనిపెట్టి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. భవిష్యత్‌లో పూర్తిగా అంధత్వాన్ని నివారించాలన్నారు.

మహిళల సమస్యలపై పోరాటం

జహీరాబాద్ టౌన్: మహిళల సమస్యలపై పోరాటం చేస్తానని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు సిద్ధురావణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ నుంచి ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు మహిళల అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. వారి అభ్యున్నతికి ప్రతీ గ్రామంలో మహిళా శక్తి సంఘాలను ఏర్పాటు చేస్తానన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి వేదికను తయారుచేస్తానని చెప్పారు. సదస్సులో నాయకులు ఫరీదాబేగం, లక్ష్మీ, సరిత, సంగమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు చెందిన నాయకుడు కీజర్ యాపై నిర్వహిస్తున్న గోల్డ్ కప్ అంతరాష్ట్ర మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. టోర్నీని సీనియర్ సివిల్ కోర్టు అధికారి షఫ్రక్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో తెలంగాణ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి 16 జట్లు పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ. 5,55,555 లక్షలు, రన్నరప్‌కు రూ.3,33,333 లక్షల నగదుతో పాటు ట్రోఫీ అందజేయనున్నారు. క్రికెట్ ప్రారంభ మ్యాచ్‌ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలిరావడంతో బాగారెడ్డి స్టేడియం కిటకిటలాడింది. కార్యక్రమంలో నిర్వాహకులు అబ్దుల్లా ఖాద్రీ, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.



బాగారెడ్డి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న ప్రేక్షకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదాన వరల్డ్ రికార్డు గ్రహీత సంపత్ కుమార్

పటాన్‌చెరు టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రక్తదాన వరల్డ్ రికార్డు గ్రహీత సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం, యువ చైతన్య సంయుక్త సహకారంతో తలసేమియా వ్యాధి బాధిత చిన్నారుల సహాయార్థంగా రక్తదాన శిబిరం, అవయవ దానం రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాతల నుంచి 25 యూనిట్ల రక్తాన్ని సైకిల్ సెల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు సేకరించారు. అనంతరం కండర క్షీణత వ్యాధి బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం ఇవ్వాలని శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ గ్రామ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, ఉపసర్పంచ్ శోభ, గురుప్రసాద్, మహేష్, సాయిలు, బాపు వెంకన్న, సంపత్ , దివ్యాంగులు పాల్గొన్నారు.



సంపత్ కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో రక్తదానం, ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలను ఆదివారం నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. రక్తదానంతో మరొకరి ప్రాణం కాపాడవచ్చన్నారు. 283 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి పాల్గొన్నారు.

ఖారీజ్‌ఖాతా భూముల్లో అక్రమ నిర్మాణాలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని మాదారం గ్రామంలో కొంతమంది అక్రమార్కులు ఖారీజ్‌ఖాతా(కేకే) భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మూడు నెలలుగా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం. గ్రామంలోని 264, 265, 267 సర్వేనంబర్‌లలో 6 ఎకరాల ఖారీజ్‌ఖాతా భూమి ఉంది. ఈ భూముల్లో గతంలో మామిడి తోట, పంటలు సాగుచేసేవారు. తాజాగా కొంత మంది అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా కేకే భూముల్లో నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన రహదారి పక్కనే నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని, ఈ విషయంపై మూడుసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణాలపై ఆర్ఐ జయప్రకాశ్ నారాయణను వివరణ కోరగా ఖారీజ్‌ఖాతా భూములు పూర్తిగా ప్రభుత్వం భూములేనని, ఈ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. తక్షణమే నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఖారీజ్‌ఖాతా భూముల్లో చేపట్టిన నిర్మాణాలు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధి అక్సాన్‌పల్లి గ్రామంలో 300 ఏళ్ల నాటి కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపట్టారు. ఆలయ పునఃనిర్మాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మండప పూజ, ధాన్యాదివాసము, గంధాది వాహనము, దూపదావాసం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ప్రతిష్ఠాపన విగ్రహాలను ఊరేగింపు అనంతరం ఆలయంలో ఉంచి శయాదివాసం, పుష్పాదివాసం చేశారు. సోమవారం ఉమాసంగమేశ్వర విగ్రహ, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన, యంత్రిమూర్తి ప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలు సర్పంచ్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

10 నుంచి క్రికెట్ టోర్నీ

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఈనెల 10వ తేదీ నుంచి సురేష్ కుమార్ షెట్కార్ (ఎస్‌కేఎస్), పట్లోళ్ల సంజీవరెడ్డి (పీఎస్ఆర్) సీజన్-1 క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్.భూపాల్, ఎస్.పవన్, శ్రీకాంత్, జగదీష్ ఆదివారం తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.40 వేలు, రన్నర్ జట్టుకు రూ.20 వేలు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఖేడ్ అనురాధ కళాశాల గ్రౌండ్‌లో డ్రా తీస్తామని తెలిపారు. ఆసక్తిగల జట్లు భూపాల్ (9848943174), ఎస్.పవన్ (7670875115), శ్రీకాంత్ (9603373165), జగదీష్ (6305053146), పవన్ (9515755259)ను సంప్రదించాలని సూచించారు.

13 నుంచి దిండి పాదయాత్ర

నారాయణఖేడ్: 224వ శ్రీసిద్ధి వినాయక జయంతిని పురస్కరించుకొని ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు దిండి పాదయాత్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కమలాపూర్ వామన్‌రావు మహారాజ్ ఆదివారం తెలిపారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఖేడ్ మార్వాడీగల్లీలోని కాశీనాథ్ మందిరం నుంచి పాదయాత్రికులు బయలుదేరి 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు న్యాల్‌కల్ మండలం రేజింతల్ సిద్ధివినాయక ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



కన్‌సాన్‌పల్లిలో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధి కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఆదివారం అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బజరంగ్‌దళ్ సభ్యులు వాడవాడలు తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. అక్షింత ఊరేగింపునకు మహిళలు మంగళహారతులు ఇచ్చారు. అంతకుముందు దుర్గాభవానీ మాత ఆలయంలో పూజలు చేశారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామపంచాయతీ పరిధి పెద్దమ్మగూడ గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. అక్షింతలకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి అక్షింతలను త్వరలో పంపిణీ చేస్తామని నిర్వాహకులు చెప్పారు.

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధి చాంద్‌ఖాన్‌పల్లిలో అయోధ్య రాముడి అక్షింతలతోపాటు శ్రీరామాలయ చిత్రపటాలను ఆదివారం అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ గడపగడపకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పటాన్‌చెరు: అయోధ్య రామ మందిర అక్షింతల వితరణ శోభాయాత్ర ఆదివారం అమీన్‌పూర్, బీరంగూడలో నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సదువుల మల్లేష్, కొల్లూరు మల్లేష్, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలుకాలనీల్లో ఆదివారం అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నారెడ్డి నగర్, రాయల్ గ్రీన్ సిటీ, వసంత్‌విహార్, రహమత్‌నగర్ డబుల్‌బెడ్ రూం కాలనీ అక్షింతలు పంపిణీ చేశారు. 22వ తేదీన ప్రతీ ఇంటిలో దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సుధీర్ బండారీ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి: అయోధ్య శ్రీరామ మందిర అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. సంగారెడ్డిలోని 12వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీన ప్రతీ ఇంటిలో దీపం వెలిగించి శ్రీరాముని కృపకు పాత్రులు కావాలన్నారు. అనంతరం నూతన హనుమాన్ దేవాలయం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అలాగే మండల కేంద్రం పుల్కల్‌తో పాటు కోడూరు గ్రామంలో అక్షింతలు పంపిణీ చేశారు.



పెద్దమ్మగూడలో..